మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితరులు

ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, పార్టీ నేతలు తాడూరి శ్రీనివాస్ తదితరులు

బీజేపీపై మాట్లాడే దమ్ము రేవంత్‌కు లేదు

- కేసుల వల్లే నోరుమెదపడం లేదు
- మోదీ అంటే అంత భయమెందుకు?
- హామీలపై నిలదీస్తే తిడుతున్నడు
- పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతు బీఆర్ఎస్ పార్టీ మాత్రమే
- పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఉప్పల్, మల్కాజిగిరిలో బీఆర్ఎస్ విజయోత్సవ సభలు

మేడ్చల్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): బీజేపీపై మాట్లాడే దమ్ము సీఎం రేవంత్‌రెడ్డికి లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి గుండు సున్నా నిధులిచ్చినా సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీశారు. ప్రధాని మోదీ అంటే అంత భయమెందుకని ప్రశ్నించారు. మేడ్చల్ జిల్లాలో ఉప్పల్, మల్కాజిగిరి నియోజకవర్గాల విజయోత్సవ సభలు ఆదివారం నిర్వహించగా, కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డిపై ఉన్న కేసుల కారణంగానే బీజేపీపై మాట్లాడేందుకు భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడిగితే కేసీఆర్‌ను రేవంత్‌రెడ్డి తిడుతున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డికి దమ్ముంటే ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. వంద రోజుల్లో ప్రజలకిచ్చిన హామీలను నేరవేర్చకుంటే ప్రజల తరపున పోరాడేందుకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

కాంగ్రెస్ పాలనపై చర్చ

60 రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై జిల్లాల్లో, గ్రామాల్లో చర్చ ప్రారంభమైందని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి అనవసరంగా ఓటు వేశామా? అని ప్రజలు చర్చించుకుంటున్నట్టు చెప్పారు. కరెంట్ కష్టాలు ప్రారంభమయ్యాయని, వ్యవసాయ మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని తెలిపారు. ప్రజలు మళ్లీ పాతరోజులను గుర్తుచేసుకుంటున్నారని చెప్పారు. బీఆర్ఎస్ సర్కారు హయాంలో రైతుబంధు పథకం నగదు జమ ప్రారంభమైతే 10 రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ అయ్యేదని, ఇప్పుడమే 60 రోజులు దాటినా నగదు జమ కాకపోవడంతో రైతులు ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటున్నారని చెప్పారు. రైతుబంధు నగదు పడిన వెంటనే టింగ్ టింగ్‌మని రైతుల ఫోన్లకు మెసేజ్‌లు వచ్చేవని, ఇప్పుడు అ మెసేజ్‌ల కోసం ఎదురుచూడాల్సి వస్తున్నదని అన్నారు. డిసెంబర్ 9న రైతు రుణమాఫీ చేస్తానని చెప్పిన రేవంత్ దానిపై నోరు మెదపడం లేదని మండిపడ్డారు.

తెలంగాణ గళం బీఆర్ఎస్సే

తెలంగాణ హక్కులపై పార్లమెంట్‌లో వినిపించే గొంతు బీఆర్ఎస్ ఎంపీలదేనని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ ఎంపీలను గెలిపిస్తే పార్లమెంట్‌లో వారి గొంతు పెకలదని చెప్పారు. పార్లమెంట్‌లో మోదీ, రాహుల్‌గాంధీలను చూసి బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు మాట్లాడే పరిస్థితి ఉండబోదని అన్నారు. తెలంగాణకు రావాల్సిన నిధులు రావాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులను తెలంగాణ ప్రజలు గెలిపించాల్సిన అవసరమున్నదని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగిరేలా బీఆర్ఎస్ శ్రేణులందరూ కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. దేశంలోనే ప్రత్యేక స్థానమున్న మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాన్ని బీఆర్ఎస్ కైవసం చేసుకొని కాంగ్రెస్‌ను మడతపెట్టి కొట్టాలని అన్నారు. ఈ సమావేశాల్లో ఎమ్మెల్యేలు మర్రి రాజశేఖర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బీ సుభాశ్‌రెడ్డి, రావుల శ్రీధర్‌రెడ్డి, మల్లారెడ్డి హెల్త్‌సిటీ చైర్మన్ డాక్టర్ భద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

42 చోట్ల ముగిసిన బీఆర్ఎస్ సమావేశాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అసెంబ్లీ నియోజకవర్గస్థాయి సమావేశాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఇప్పటి వరకు 42 నియోజకవర్గాల్లో పార్టీ సమావేశాలు ముగిశాయి. పార్టీ కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకులను పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధం చేయడానికి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో సమావేశాలు నిర్వహిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో నిరాశలో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తల్లో కొత్త ఊపు, ఉత్సాహం, ధైర్యాన్ని నింపేందుకు సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల రెండో వారంలోగా సమావేశాలను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ సమావేశాలకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో సహా మాజీ స్పీకర్లు మధుసూదనాచారి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ తదితరులు హాజరవుతున్నారు. సోమవారం మరో 8 నియోజకవర్గాల్లో సమావేశాలు జరుగనున్నాయి. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలు చేసే తప్పుడు ప్రచారాలను దీటుగా తిప్పి కొట్టడం, కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు, వాటి ప్రస్తుత పరిస్థితి ప్రజలకు వివరించడం, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాల్సిన ప్రాధాన్యాన్ని ముఖ్య నాయకులు, కార్యకర్తలకు వివరిస్తున్నారు.

ఇందిరమ్మ రాజ్యం అంటే ఇంద్రవెల్లి కాల్పులేనా?

- హంతకులే సంతాపం ప్రకటించడం దుర్మార్గం
- ప్రభుత్వాన్ని పడగొట్టాల్సిన అవసరం మాకేం లేదు
- కాంగ్రెస్‌ను బొందపెట్టేందుకు ఇచ్చిన హామీలు చాలు
- ప్రభుత్వంపై ప్రజల్లో విముఖత: మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

చెన్నూర్ నియోజకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

మంచిర్యాల, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఇందిరమ్మ రాజ్యం తెస్తాం అంటే ఏం తెస్తారు? మళ్లీ ఇంద్రవెల్లి కాల్పులు తెస్తారా? మరోసారి ఎమర్జెన్సీ తెస్తారా? అని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మండిపడ్డారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని ఆదివారం మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అధ్యక్షతన ఆయన స్వగృహంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల్లో సానుభూతి రావాలనే ఇందిరమ్మ పేరు వాడుకుంటున్నారని ధ్వజమెత్తారు. దేశంలో ఇందిరమ్మ దాదాపు 17 ఏండ్లు రాజ్యం చేసినంక కూడా పేదరికం ఎందుకు ఉందో చెప్పాలని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యం గొప్పగా ఉంటే ఆమె మనుమడు రాహుల్‌గాంధీ ఎందుకు పాదయాత్ర చేస్తున్నారో చెప్పాలని డిమాండ్‌చేశారు.

గద్దర్ సహచరులను చంపిందెవరు?

ఇంద్రవెల్లి సభలో గద్దర్ గజ్జ కట్టి పాటపాడితే ఆయన సహచరులను కాల్చి చంపిన కాంగ్రెస్ సర్కారు, ఇవాళ మళ్లీ అక్కడ స్థూపం కడతామనడం సిగ్గుచేటని నిరంజన్‌రెడ్డి దుయ్యబట్టారు. ఇంతకన్నా సిగ్గుమాలిన వ్యవహారం ఉంటుందా? ఎక్కడైనా హంతకులే సంతాపం ప్రకటిస్తారా? అని ప్రశ్నించారు. ఆఖరి రోజుల్లో గద్దర్ తన సిద్ధాంతాలను మార్చుకొని ఉండొచ్చు కానీ, ఆయన ఏ వర్గాలకు ప్రతినిధిగా ఆనాడు పోరాటం చేశారో ఆలోచించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో 16 మంది ఆటోడ్రైవర్లు ఆత్మహత్య చేసుకుంటే, ప్రగతిభవన్ ముందు ఆటోను కాలబెట్టి నిరసన తెలిపితే, ఏ ఒక్క మీడియా దాన్ని చూపించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'కేసీఆర్ మా ప్రభుత్వాన్ని పడగొడుతారంట.. వీళ్లు పడగొడుతారంట.. వాళ్లు పడగొడుతారంట' అని భుజాలు ఎందుకు సరుసుకుంటున్నరో అర్థం కావడం లేదన్నారు. మిమ్ములను బొంద పెట్టడానికి కాంగ్రెస్ ఇచ్చిన హామీలే సరిపోతాయని చురకలు అంటించారు. రెండు నెలల్లోనే ప్రభుత్వంపై ప్రజల నుంచి ఛీత్కారాలు వస్తున్నాయని చెప్పారు. ఎంపీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ మంత్రి బోడ జనార్దన్, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం అనుచిత వ్యాఖ్యలపై నెటిజన్ల ఆగ్రహం

- రేవంత్ తప్పిన హామీలన్నీ ఓ చోట చేర్చి కామెంట్లు
- కేసీఆర్ కౌంటర్ వీడియోలకు సోషల్ మీడియాలో లైకుల వర్షం

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): సీఎం హోదాలో ఉన్న రేవంత్‌రెడ్డి చేసిన అసభ్యకరమైన వ్యాఖ్యలను ఇటు నెటిజన్లు, బీఆర్ఎస్ కార్యకర్తలు, అటు కేసీఆర్ అభిమానులు సోషల్ మీడియా వేదికగా తిప్పికొడుతున్నారు. కేసీఆర్‌ను అసభ్యంగా దూషిస్తూ వాడిన ఆ పదజాలానికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరును చేర్చి హ్యాష్‌ట్యాగ్ పేరిట వేలాది పోస్టుల వర్షం కురిపిస్తున్నారు. దీంతో 'ఎక్స్'లో #xxxRevanth హ్యాష్‌ట్యాగ్ గంటలోపే ట్రెండింగ్‌లోకి వచ్చింది. 'తీట మా టలు మానుకో' రేవంత్ అంటూ ఓ నెటిజన్ దివంగత ఉద్యమ గాయకుడు సాయిచంద్ తిట్ల రూపంలో పాడిన పాటను పోస్టు చేశారు. భారతీయుడు అనే నెటిజన్ గతంలో కేసీఆర్ అనుభవపూర్వకంగా చెప్పిన మాటలను వీడియోగా పోస్టు చేశారు. 'తాను రాజకీయాల్లోకి వచ్చినప్పుడు ధర్మయుద్ధం ఉందని. ఇప్పటిలాగా లంగా యుద్ధం లేదు' అని కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను పోస్టు చేశారు. గణేశ్ అనే నెటిజన్ 'అరేయ్ గుంపు మేస్త్రీ నిన్నేరా అనేది' అంటూ కామెంట్ చేశాడు. 'కేసీఆర్ గారు మీరు ఈ లుచ్చxxx గాడి గురించి మాట్లాడాల్సిన అవసరం లేదు' అంటూ మరో నెటిజన్ కేసీఆర్ ఎన్నికల వేళ మాట్లాడిన ఓ వీడియోను పోస్టు చేశారు. 'సరదా.. సరదాకే అసెంబ్లీని అంటుబెట్టేటోడు ఆయన.. నువ్వింక వైట్ పే పర్ అంటున్నవ్ సూస్కో మల్లా.. ఇజ్జత్ తీసుకోకు' అంటూ మరో నెటిజన్ పోస్టు చేశారు. 'ఇక నుంచి గుంపుమేస్త్రీ కాదు.. రండ రేవంత్' అనేవి.. 'ఇక కాస్కో xxx రేవంత్' అంటూ పోస్టుల వర్షం కురుస్తూనే ఉంది. ఒక్కోపోస్టుకు వందల్లో లైకులు, వేలల్లో వ్యూస్ వస్తున్నాయి.

ప్రాజెక్టులపై అన్నీ అబద్ధాలే

- రేవంత్ మాటల్లో ఒక్కటీ నిజం లేదు
- ప్రాజెక్టుల అప్పగింతను చట్టం చేసింది కాంగ్రెస్.. షరతులు పెట్టింది బీఆర్ఎస్
- గొప్పవాళ్లను తిడితే గొప్పవాళ్ల యిపోరు
- బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 4(నమస్తే తెలంగాణ): ప్రాజెక్టుల అప్పగింతపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పేవన్నీ అబద్ధాలేనని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గౌరవప్రదమైన పదవిలో ఉండి అవాస్తవాలు, అర్ధసత్యాలు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పునర్విభజన చట్టాన్ని రూపొందించినది ఎవరు? ఆ కమిటీలో ఉన్నది ఎవరని ప్రశ్నించారు. ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించాలని చట్టంలో పెట్టింది కాంగ్రెస్ కాదా? అని నిలదీశారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి చేస్తున్నది అదేనని పేర్కొన్నారు. ఒకవేళ కాంగ్రెస్ ఆరోపణలే నిజమైతే రెండు నెలల క్రితం వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టులను కేంద్రానికి ఎందుకు అప్పగించలేదని ప్రశ్నించారు. ఇప్పుడు ప్రజల్లో వ్యతిరేకత వచ్చేసరికి మినిట్స్‌లో తప్పురాశారని, దాన్ని సవరించాలని బోర్డుకు లేఖ రాస్తామని కొత్త డ్రామా మొదలుపెట్టారని విమర్శించారు. పోతిరెడ్డిపాడుకు వ్యతిరేకంగా ఆనాడు పోరాడింది బీఆర్ఎస్ పార్టీయేనని గుర్తుచేశారు. గొప్పవాళ్లను తిట్టినంత మాత్రాన గొప్పవారైపోరంటూ రేవంత్‌రెడ్డికి చురకలు అంటించారు. కరెంటు ఇవ్వక, ప్రాజెక్టుల్లో నీళ్లు విడుదల చేయక పంటలు ఎండిపోతుంటే దానికి కారణం కేసీఆరే అని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ 60 రోజులపాలనలో అబద్ధాలు, తప్పుడు ప్రచారాలు, బూతులు తప్ప మరేమీ లేవని, రేవంత్‌రెడ్డి ఇకనైనా సీఎం హోదాకు తగ్గట్టుగా మాట్లాడాలని సతీశ్‌రెడ్డి హితవు పలికారు.



సూర్యాపేట జిల్లా కోదాడలో ఆదివారం మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

చేతగానితనంతోనే కృష్ణార్పణం

- కాంగ్రెస్ వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకే కేసీఆర్‌పై దాడి
- కేంద్రంతో లాలూచీ పడే ప్రాజెక్టులను అప్పగించారు
- కేసీఆర్ పోరాటం వల్లే ఇన్నేండ్లు కేంద్రం కుట్రలు సాగలేదు
- బీఆర్ఎస్ హయాంలో వరుసగా 18 పంటలకు సాగర్ నీళ్లు
- కృష్ణా ప్రాజెక్టుల అప్పగింతపై మంత్రి ఉత్తమ్ జవాబివ్వాలి
- సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ)/కోదాడ: ప్రాజెక్టులు కేఆర్ఎంబీ (కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు) కంట్రోల్‌లోకి పోవడం కాంగ్రెస్ వైఫల్యమేనని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. ఆదివారం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి శివారులో మీడియాతో, సూర్యాపేట జిల్లా కోదాడలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో జగదీశ్‌రెడ్డి మాట్లాడారు. సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకే కేసీఆర్‌పై దాడి చేస్తున్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ పోరాటం వల్లే ఇన్నాళ్లు కేంద్రం కుట్రలు సాగలేదని, కేంద్ర ప్రభుత్వంతో సీఎం రేవంత్ లాలూచీ పడి ప్రాజెక్ట్‌లను అప్పగించారని ఆరోపించారు.

రాష్ట్ర కంట్రోల్‌లో ప్రాజెక్టులు కేసీఆర్ ఘనతే

ప్రాజెక్టులపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాట్లాడక ముందే కాంగ్రెస్ నేతలు ఉలిక్కిపడుతున్నారని జగదీశ్‌రెడ్డి దుయ్యబట్టారు. కేసీఆర్‌పై దాడిచేసి తప్పించుకోవచ్చనే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహించారు. కేసీఆర్ ఇంకా బయటకే రాలేదని, అయినా ఏదేదో ఊహించుకొని వారు మాట్లాడుతున్న తీరు చూస్తే వాళ్లు తప్పు చేశారనే విషయం స్పష్టంగా అర్థమవుతున్నదని పేర్కొన్నారు. కేసీఆర్ కేంద్రంతో పదేండ్లు కొట్లాడి ప్రతి క్షణం ప్రాజెక్టులు మన చేతి నుంచి చేజారకుండా చర్యలు తీసుకున్నారని చెప్పారు. ఎన్ని రకాల ఒత్తిళ్లు పెట్టినా హక్కులను వదులుకోబోమని ప్రాజెక్టులను రాష్ట్ర కంట్రోల్‌లో ఉంచిన ఘనత కేసీఆర్‌దేనని వివరించారు. ఇన్నాళ్లూ మన వాటాను వాడుకోగలిగామని, పదేండ్లలో మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో సాగుకు సరిపడా నీరందించడం వల్లే పుష్కలంగా పంటలతోపాటు అవసరమైన విద్యుత్తు ఉత్పత్తి చేసుకొని, తాగునీటికి కూడా ఇబ్బందులు లేకుండా చూసుకున్నామని వెల్లడించారు.

ప్రభుత్వ తీరును ఎండగడతాం

కేంద్రం కేఆర్ఎంబీపై సమావేశం ఏర్పాటు చేసినప్పుడు నిర్లక్ష్యంగా ఎందుకు ఉన్నారని, ముఖ్యమంత్రి అధికారులతో ఎందుకు సమావేశం పెట్టలేదని, దానిపై నీటిపారుదలశాఖ మంత్రి ఎందుకు సమీక్ష చేయలేదని జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. అధికారులే వెళ్లి ప్రాజెక్టులను అప్పచెప్పి రావాల్సి రావడానికి కారణం ఏమిటని నిలదీశారు. రేవంత్ ఎక్కడో ఇంకో ప్రయోజనం పొందడానికే రాష్ట్ర, తెలంగాణ రైతాంగ ప్రయోజనాలను తాకట్టు పెట్టారని ఆరోపించారు. దీనిపై అసెంబ్లీ, పార్లమెంటుతోపాటు అన్ని వేదికలపై ఎండగడతామని చెప్పారు. తెలంగాణ ప్రజల కోసం కొట్లాడింది, హక్కులను కాపాడింది కేసీఆర్ మాత్రమేనని వెల్లడించారు. రెండు జాతీయ పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందం వల్లే మన ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించి మన జుట్టు కేంద్రం చేతికిచ్చారని ఆరోపించారు. కృష్ణాజలాలపై కేంద్ర పెత్తనం తో ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి, పాలమూరు జిల్లాలు సాగు, తాగునీటికి కేంద్ర ప్రభుత్వ అనుమతుల కోసం ఎదురుచూడాల్సి వస్తున్నదని పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగం దోపిడీకి గురికాబోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై కేసీఆర్ నాయకత్వంలో పోరాటం చేసి ప్రభుత్వం మెడలు వంచుతామని పేర్కొన్నారు. పదేండ్లలో సాగు, తాగునీటితోపాటు విద్యుత్తు అందించామని చెప్పారు. వరుసగా సాగర్ ఎడమ కాల్వ కింద 18 పంటలకు నీరు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని గుర్తుచేశారు. ఇప్పుడు కాంగ్రెస్ రెండో పంటకు కూడా నీరు ఇవ్వలేని దుస్థితిలో ఉన్నదని పేర్కొన్నారు. కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడంపై ఎడమ కాల్వ రైతాంగం ఉద్యమించేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. బాధ్యత లేని కాంగ్రెస్ మంత్రులతో ప్రజలకు కష్టాలు తప్పడంలేదని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, నాయకులు పాల్గొన్నారు.

అతి తెలివి బంజెయ్ రేవంత్

- అసెంబీలో కాంగ్రెస్ మోసం చెప్తం
- ప్రాజెక్టులు ఇయ్యాలంటే మేం కేంద్రానికి షరతులు పెట్టినం
- కేంద్రం ఒప్పకోలే.. కేఆర్ఎంబీకి మేం ప్రాజెక్టులు ఇయ్యలే
- పోతిరెడ్డిపాడు ప్రాజెక్టుపై మాట్లాడే హక్కు నీకు ఉన్నదా?
- సీఎంగా హుందాగా మాట్లాడు
- పాలన చేతగాక బీఆర్ఎస్ ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నవ్
- రేవంత్‌పై హరీశ్‌రావు ఆగ్రహం
- పటాన్‌చెరు, ఎల్బీనగర్ బీఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశం

హామీలపై బాండ్ పేపర్ రాసిచ్చింది కాంగ్రెస్ కాదా?
డిసెంబర్‌లో 4 వేల పెన్షన్ ఇస్తామన్నది కాంగ్రెస్ కాదా?
డిసెంబర్ 9న 2 లక్షల రుణమాఫీ ఇస్తామన్నది కాంగ్రెస్ కాదా?
ఫిబ్రవరి 1న గ్రూప్-1 నోటిఫికేషన్ ఇస్తామన్నది కాంగ్రెస్ కాదా?
- హరీశ్‌రావు

24 గంటల కరెంటును 12 గంటలకే కోత పెట్టడమే మార్పా?
ఫిబ్రవరి వచ్చినా రైతులకు రైతుబంధు ఇవ్వకపోవటమే మార్పా?
ప్రాజెక్టులపై రాష్ట్రానికి అధికారం లేకుండా చేయటమే మార్పా?
6 లక్షల మంది ఆటోడ్రైవర్లను రోడ్డుమీదికి తేవటమే మార్పా?
- హరీశ్‌రావు

ఎల్బీనగర్ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

సంగారెడ్డి/హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): 'అతి తెలివి బంజెయ్.. రేవంత్. అర్థంకాక, ఆలోచన లేక, ఆగమాగమై ప్రాజెక్టులు అప్పజెప్పి రేపటి రోజు హైదరాబాద్‌కు తాగునీరు లేకుండా చేసినవ్. ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్‌కు సాగునీరు, తాగునీటికి సమస్య వస్తుంది. పోతిరెడ్డిపాడు గురించి మాట్లాడే హక్కు నీకు ఉన్నదా? నాడు అసెంబ్లీలో మేం కొట్లాడినం. మంత్రి పదవులను మీ కాంగ్రెస్ ప్రభుత్వంపై విసిరికొట్టినం. నువ్వు ఆ నాడు టీడీపీలో ఉండి పెదవులు మూసుకున్నవ్. నువ్వా మా గురించి మాట్లాడేది?' అని సీఎం రేవంత్‌పై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రాజెక్టులపై అసెంబ్లీలో చర్చ పెడదామన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రతిసవాల్ విసిరారు. 'యస్! మేం రెడీ. అసెంబ్లీలో చర్చ పెట్టు. నీ దిమ్మదిరిగేటట్టు సమాధానం చెప్తం. గతంలో అసెంబ్లీలో కేసీఆర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ పెడితే పారిపోయింది మీ కాంగ్రెస్ పార్టీ. కానీ మేం అలా కాదు. పారిపోం. మేం సిద్ధంగా ఉన్నాం. నువ్వు చేసిన మోసాన్ని అసెంబ్లీ సాక్షిగా బయటపెడ్తం. తెలంగాణ ప్రజలకు అర్థమయ్యేలా వివరంగా చెప్తం' అని స్పష్టం చేశారు. ఆదివారం ఎమ్మెల్యేలు మహిపాల్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి అధ్యక్షతన పటాన్‌చెరు, ఎల్బీనగర్ నియోజకవర్గాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. పదేండ్ల కేసీఆర్ ప్రభుత్వంలో కేంద్రం ఎంత ఒత్తిడి చేసినా ఏ రోజూ కేఆర్ఎంబీకి కృష్ణా ప్రాజెక్టులు అప్పజెప్పలేదని స్పష్టం చేశారు. 'నీళ్లపై తెలంగాణకు 50 శాతం వాటా ఇవ్వాలి, శ్రీశైలం ప్రాజెక్టును హైడల్ ప్రాజెక్టుగా గుర్తించాలి అని అనేక షరతులు పెట్టాం. కేంద్రం ఒప్పుకోలేదు. అందుకే మేం ప్రాజెక్టులు అప్పజెప్పలేదు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండు నెలలు కూడా కాక ముందే మన ప్రాజెక్టులన్నీ కేంద్రానికి అప్పజెప్పింది. రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టింది' అని తెలిపారు. సీఎం రేవంత్‌కు విషయం లేక విషం చిమ్మే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

రేవంత్‌వి చిల్లర మాటలు

రాజకీయాల్లో హుందాతనం ఉండాలని ఆదివారం ఉదయం మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు రేవంత్‌కు చెప్పారని, కానీ మధ్యాహ్నానికే రేవంత్ చిల్లర మాటలు, అసభ్యపు మాటలు మాట్లాడారని హరీశ్‌రావు వెల్లడించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎలా మాట్లాడుతున్నారో, ఇప్పుడు అలాగే మాట్లాడుతున్నారని, రేవంత్ మాటలు టీవీలో చూసి పిల్లలు అసహ్యించుకుంటున్నారని అన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ప్రాజెక్టులను కేంద్రానికి అప్పజెప్పాలని బిల్లు పెట్టి పాస్ చేసింది కాంగ్రెస్ కాదా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. బిల్లును తయారు చేసింది మీ జైపాల్‌రెడ్డి కాదా? అని నిలదీశారు.

రాముడితో బీజేపీ రాజకీయాలు

కేంద్రంలోని బీజేపీ రాముడితో మత రాజకీయాలు చేస్తున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. రాముడు ప్రతి ఒక్కరికి దేవుడని, ప్రజలంతా ఆయనను కొలుస్తారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో రాజకీయ లబ్ధిపొందేందుకు బీజేపీ రాముడిని రాజకీయాలతో ముడిపెడుతుందని విమర్శించారు. కేసీఆర్ సైతం తెలంగాణలో యాదాద్రి ఆలయాన్ని పునర్నిర్మించారని, ఎన్నడూ మత రాజకీయాలకు పాల్పడలేదని గుర్తు చేశారు.

తెలంగాణ కోసం పోరాడేది బీఆర్ఎస్సే

అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్‌కు కేవలం స్పీడ్‌బ్రేకర్ లాంటివని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఢిల్లీలో తెలంగాణ ప్రయోజనాల కోసం పోరాడాలంటే ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధించాలని చెప్పారు. ఎంపీ ఎన్నికల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సత్తా చాటాలని, పట్టుదలతో పనిచేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌కు జాతీయస్థాయిలో, ఇటు రాష్ట్రంలో ఎలాంటి భవిష్యత్తు లేదని తెలిపారు. ఎంపీ ఎన్నికల్లో ఆ పార్టీ గెలిచే పరిస్థితి లేదని వెల్లడించారు. కాంగ్రెస్‌కు ఓటమి తప్పదని తెలిసే, సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చ